విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి

విశాలాంధ్ర-టి నరసాపురం: టి నరసాపురం పోలీసు స్టేషన్ లో హెడ్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న బి. బాలాజీ (48) గుండె పోటు తో సోమవారం రాత్రి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బాలాజీ గత ఎనిమిదేళ్లుగా టి నరసాపురం పోలీసు స్టేషన్ లో విధులు నిర్వహిస్తూ ఇటీవల టి నరసాపురం పోలీసు స్టేషన్ లోనే హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందారు. సోమవారం రాత్రి భోజనం చేశాక గుండెపోటు రావడంతో పోలీసులు అతన్ని జంగారెడ్డిగూడెం ఆసుపత్రికి తరలించారు. బాలాజీ చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతనికి భార్య వుంది.

పర్యావరణంపై అవగాహనతో ఉండాలి

విశాలాంధ్ర - లింగపాలెం : పర్యావరణంపై విద్యార్థులు అవగాహనతో ఉండాలని లింగపాలెం గ్రంథాలయ అధికారి లతీఫ్ అన్నారు. వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించారు. చెట్లను కాపాడుకోవాలని, పరిశుభ్రతగా ఉండాలని తెలిపారు. విద్యార్థి దశలో వీటిపై అవగాహన ఉన్నప్పుడు భవిష్యత్తులో మంచి మార్పు వస్తుందని వివరించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించాలనని అన్నారు. ప్రతీ ఇంటిలో విద్యార్థులు పర్యావరణం, పరిశుభ్రతపై తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. దీంతో విద్యార్థులకు చదరంగం క్రీడపై శిక్షణ ఇప్పించారు.

వేగంగా ధాన్యం కొనుగోళ్ళు

విశాలాంధ్ర - లింగపాలెం : దాళ్వా పంటగా పండించిన ధాన్యం కొనుగోళ్ళు లింగపాలెం మండలంలో దాదాపుగా పూర్తయ్యాయని వ్యవసాయ శాఖాధికారి మురళీకృష్ణ తెలిపారు. మండలంలో 1500 ఎకరాలలో ధాన్యం పండించారని, దాదాపు మూడు వేల మెట్రిక్ టన్నుల దిగుబడులు వచ్చాయని అన్నారు. వీటిలో రెండు వేల టన్నులు ప్రభుత్వం కొనుగోలు చేసిందని వివరించారు. దాదాపు 250 మంది రైతులు దాళ్వా పంట వేశారని, కొందరు ఎంరైంతులు పండించిన ధాన్యాన్ని నిల్వ ఉంచుకున్నారని అన్నారు. ఇంకా 150 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాల్సి ఉందని కొనుగోళ్ళు ఈనెల 15 వరకు సమయం ఉందని తెలిపారు. ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యానికి సకాలంలో డబ్బును వారి ఖాతాలలో జమ చేయటం జరుగుతుందని అన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - కలిదిండి : ఉపాధి కూలీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళిరావు డిమాండ్ చేశారు. మంగళవారం మండలం లోని కోరుకొల్లు,కొచ్చర్ల, ఆవకూరు గ్రామాలలో పని ప్రదేశాలలో పర్యటించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొంతమంది కూలీలకు గత సంవత్సరం రావలసిన వేతనాలు పెండింగ్ లో ఉన్నాయని, ఆ పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని అన్నారు. ఎక్కువమంది కూలీలకు సంవత్సరంలో 100 రోజుల పని దినాలు కూడా పూర్తి కావడం లేదని గ్రామాలలో డ్రైనేజీ పనులను ఉపాధి హామీలో చేర్చడం ద్వారా పని దినాలు పెంచాలని తెలిపారు. పని ప్రదేశాలలో వైద్య సౌకర్యాలను కల్పించాలని తెలిపారు. ఉపాధి పనిలో ఫోటోలు తీసే పద్ధతిని తీసివేయాలని కోరారు. 200 రోజులు పని దినాలు కల్పించి రూ 600 లు వేతనం ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం కార్యకర్తలు పెనుమాల రమేష్, కే. లాజరు, పాము సుధాకర్, బి. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో గుండె ఆరోగ్యం

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : ఔషధాలతో పాటు సమతుల్య పోషక ఆహారం, అవసరమైన మేరకు శరీరక శ్రమ (వ్యాయామం) తో గుండె ఆరోగ్యమును కాపాడుకోవచ్చునని గుండె వైద్య నిపుణులు డాక్టర్ పి. చంద్రశేఖర్ వర్మ రోగులకు వివరించారు. మేంటేవారి తోటలోని అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో మంగళ వారం రోగులను పరీక్షించి వారికి గుండె వైద్య సేవలు అందించారు.. ఈ సందర్భంగా ఈసీజీ ,2 డి ఎకో పరీక్షలను నిర్వహించారు. శ్రీ లక్ష్మీ గాయత్రి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ (హైదరాబాద్), వసుధ ఫౌండేషన్ లసహకారంతో ఏ బి ఎస్ వి కే లో అందిస్తున్న వైద్య సేవలనువాటిని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు కోరారు. ప్రతిరోజు సాయంత్రం సాధారణ వ్యాధులు ,స్త్రీలకు సంబంధించిన వ్యాధులకు ప్రముఖ వైద్యులు అందిస్తారన్నారు.అలాగే ప్రతి మంగళవారం ఉదయం గుండె వైద్య నిపుణులు తమ సేవలను ఉచితంగా అందిస్తారని ప్రజలందరూ ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మానవసేవే... మాధవసేవ

విశాలాంధ్ర - ఉండి : మానవసేవే మాధవసేవ అని, అన్నార్తులకు పట్టెడు అన్నం పెట్టడంలో ఎంతో ఆనందం ఉంటుందని సీనియర్ జర్నలిస్ట్ ప్రైమ్ నైన్ రిపోర్టర్ మణికంఠ తెలిపారు. మంగళవారం మణికంఠ జన్మదినోత్సవ వేడుకలు సందర్భంగా ముందుగా తల్లిదండ్రులు దీవెనల పొందిన అనంతరం ఆకలితో అలమటిస్తున్న అనాథలకు ఆహార పొట్లాలను పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జర్నలిస్ట్ మణికంఠ మాట్లాడుతూ జన్మదినోత్సవ వేడుకలు వివాహ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకొని చాలామంది వేలాది రూపాయలతో అనవసరమైన ఆర్భాటాలు చేయడం ఆనవాయితీగా వస్తుందని అదే డబ్బులతో ఆకలితో అలమటిస్తున్న ఎంతోమంది పేదలకు కడుపునిండా అన్నం పెట్టడంలో ఎంతో ఆనందం ఉంటుందని వారు సూచించారు. కంటికి కనిపించే దైవాలు తల్లిదండ్రులను పూజించుకోవడంలో ఎంతో ఆనందం ఉంటుందని తెలిపారు.

ఎమ్మెల్యే నిమ్మల అరెస్ట్

విశాలాంధ్ర - పాలకొల్లు: పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడును పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. యలమంచిలి మండలం చించినాడ గ్రామంలో పెరుగులంక భూమిలో మట్టి తరలింపును అడ్డుకున్న సిపిఎం నాయకులకు మద్దతుగా ఎమ్మెల్యే రామానాయుడు నిలిచారు. పోలీసులు నిమ్మల రామానాయుడును అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. దీంతో ఒక్కసారిగా తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులు, ఆందోళనకారులకు వాగ్వాదం చోటుచేసుకుంది. ఎందుకు అరెస్ట్ చేస్తున్నారో చెప్పాలంటూ ఎమ్మెల్యే నిమ్మల పోలీసులను నిలదీశారు. నేపద్యంలో ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు అరెస్ట్ ను పలువురు ఖండిస్తున్నారు.

పోరాట స్ఫూర్తి ప్రదాత సీఆర్

విశాలాంధ్ర-ఏలూరు: నిరంతర పోరాట స్ఫూర్తి ప్రదాత చంద్ర రాజేశ్వరరావు అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ అన్నారు. సీపీఐ ఏలూరు ఏరియా సమితి ఆధ్వర్యంలో చంద్ర రాజేశ్వరరావు 109వ జయంతి కార్యక్రమం ఆర్.ఆర్. పేట, స్ఫూర్తి భవన్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డేగా ప్రభాకర్ మాట్లాడుతూ చంద్ర రాజేశ్వరరావు మంగళాపురం అనే ఒక చిన్న కుగ్రామంలో పుట్టి, భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ కార్యదర్శిగా అనేక దేశాలలో పర్యటించి ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమాన్ని అవగాహన చేసుకున్న మహోన్నత నేత అని కొనియాడారు. సోవియట్ యూనియన్‌లో ప్రతిష్టాత్మకమైన అవార్డు ఆర్డర్ ఆఫ్ లెనిన్ అవార్డును తీసుకున్న గొప్ప ఉద్యమకారుడు చంద్ర రాజేశ్వరరావని కొనియాడారు. ఆయన చల్లపల్లి జమీందారీ వ్యతిరేక పోరాటంతో పాటు అనేక ఉద్యమా లను నిర్మించి, నిర్వహించి ఎందరికో స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని, ఆయన నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు నాయకుడుగా తన చివరి చరమాంకంలో రాసిన వీలు నామా ప్రసిద్ధి చెంది కమ్యూనిస్టు ఉద్యమంలో పనిచేసే ప్రతి వారికీ ఆదర్శప్రాయమైందని తెలిపారు. సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చంద్ర రాజేశ్వర రావు సీపీఐ జాతీయ కార్యదర్శిగా ఎన్నికైన తరువాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే పరిమితమైన వ్యవసాయ కార్మిక సంఘాన్ని 1968వ సంవత్సరం దేశ స్థాయిలో భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్‌గా నిర్మాణం చేసిన గొప్ప ఉద్యమ కారుడు చంద్ర రాజేశ్వరరావు అని కొనియాడారు. సీపీఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమంలో పనిచేసే ప్రతి ఒక్కరికి చంద్ర రాజేశ్వరరావు జీవితం ఆదర్శనీయమైందన్నారు. ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిరంతరం ఉద్యమాలు నిర్వహించిన చంద్ర రాజేశ్వరరావు ఆశయాలను సాధించ డమే మనం ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళి అని పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఏలూరు ఏరియా కార్యవర్గ సభ్యురాలు మావూరి విజయ, సీపీఐ నాయకులు నాగం అచ్యుత్, యర్రా వెంకటేశ్వరరావు, బుగ్గల ప్రభాకర్, గొర్లి స్వాతి, బెతా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో: పీడిత, తాడిత ప్రజల అభ్యున్నతి, సామాజిక అసమానతలులేని సమసమాజం కోసం, దోపిడీ వ్యవస్థ అంతానికి తుది శ్వాస వీడేవరకు పోరాడిన యోధుడు కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు అని ఆయన ఆశయాల సాధనకు అందరు పునరంకితం కావాలని సిపిఐ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. మంగళవారం భీమవరంలోని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో కమ్యూనిస్టు అగ్రనేత కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు 109 వ జయంతిని సిపిఐ శ్రేణులు ఘనంగా నిర్వహించి నివాళు లర్పించాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన కోనాల చంద్ర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడుతూ సంపన్న కుటుంబంలో పుట్టి బెనారస్ యూనివర్సిటీలో వైద్య విద్యనభ్యసిస్తూ సమసమాజ నిర్మాణం కోసం సామాజిక న్యాయం కోసం తన వైద్య విద్యను సైతం విడనాడి కమ్యూ నిస్టు ఉద్యమాల్లో భాగం పంచుకుని పోరాటం సల్పిన యోధుడు కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావని కొనియాడారు. సిపిఐ జాతీయ ప్రధాన

భీమవరం

కార్యదర్శిగా 28 ఏళ్ళ అంకితభావంతో పనిచేసి పార్టీని అగ్రభాగాన నిలిపారని ఆయన పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం కావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాం ప్రసాద్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు మల్లుల శ్రీనివాసరావు, వై.వి.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కామవరపుకోటలో : భూస్వాముల చేతిలో ఉన్న భూములను పేదలకు పంపిణీకి పోరాటాలు చేసిన గొప్ప యోధుడు చంద్ర రాజేశ్వరరావు అని సిపిఐ మండల కార్యదర్శి టీవీఎస్ రాజు అన్నారు. కామవరపుకోట శ్రీఅన్నపూర్ణ రైస్ మిల్ ఆవరణలో మండల కార్యవర్గ సభ్యులు మీనుగుల దుర్గారావు అధ్యక్షతన చంద్ర రాజేశ్వరరావు జయంతి నిర్వహించారు. ఆనాడు దేశ ప్రజలు బ్రిటిష్ ముష్కరుల బానిసత్వంలో నలుగుతున్న ప్రజలకు రక్షణ కల్పించాలని తన వైద్య విద్యను నిలిపివేసి బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా దేశ స్వతంత్ర పోరాటంలోకి ప్రవేశించి ఎర్రజెండా చేతపట్టి ఆర్ఎస్ఎస్ లాంటి మతోన్మాద శక్తులను

కామవరపుకోట

తరిమికొట్టిన మహనీయుడు అని కొనియాడారు. తన వాటాకు వచ్చిన 550 ఎకరాల భూమిని ప్రజా ఉద్యమాల కోసం త్యాగం చేసిన రాజేశ్వరరావు ధన్యజీవి అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఏరియా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు చలమాల శ్రీనివాసరావు, బీవీ రాఘవులు, బాలిన రమణారావు, పిల్లి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడిలో : చంద్ర రాజేశ్వరరావు జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని కేంద్రంలో ఉన్న మతోన్మాద బిజెపి ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో ఓడించాలని సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల

చింతలపూడి

గురవయ్య పిలుపునిచ్చారు. చంద్ర రాజేశ్వరరావు 109వ జయంతి స్థానిక సిపిఐ కార్యాలయంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి తొర్లపాటి బాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గురవయ్య మాట్లాడుతూ చంద్ర రాజేశ్వర రావు భారత కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో ముఖ్యపాత్ర పోషించారని అన్నారు. చల్లపల్లి భూ పోరాటాన్ని నడిపి వేలాది ఎకరాలు పేదలకు దక్కడం లో ఆయన పోరాట స్ఫూర్తి మరువలేనిదన్నారు. ఆయన సొంత భూమిని కూడా పేదలకు పంచిన ఘనత ఉందన్నారు. విద్యార్థి సంఘంలో నుంచే ఆయన ప్రజా సమస్యలపై పోరాటాలు చేశారని పేర్కొన్నారు. తొలుత ఆయన చిత్రపటానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు బోడ వజ్రం పూలమాలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి పుల్లూరు సోమశేఖర్ ఆచార్యులు, మండల కమిటీ సభ్యులు దొంతా కృష్ణ, లాజరు, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి తొర్లపాటి రాజు, మెంతిని జోత్స్న, మింటిని సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

తణుకులో : భారత కమ్యూనిస్టు పార్టీ అగ్రనాయకులలో ప్రముఖులు, భూ పోరాట యోధుడు చంద్ర రాజేశ్వరరావు అని భారత కమ్యునిస్టు పార్టీ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, ఏరియా కన్వీనర్ టి అప్పలస్వామి కొనియాడారు. చంద్ర రాజేశ్వరరావు 109 వ జయంతి సందర్భంగా మంగళవారం పట్టణంలోని మున్సిపల్ పార్క్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి సీపీఐ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బొద్దాని నాగరాజు, టి అప్పలస్వామి మాట్లాడుతూ చంద్ర రాజేశ్వరరావు భారత కమ్యునిస్టు పార్టీ అగ్ర నాయకులలో ప్రముఖులని 1950 లో అవిభక్త కమ్యునిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా , మరోసారి పార్టీ చీలిక తర్వాత 1964 లో ప్రధాన కార్యదర్శి గా పాతిక సంవత్సరాల పాటు బాధ్యతలు నిర్వహించారని కొనియాడారు. ఆయనకు వారసత్వంగా వచ్చిన ఆస్తిని అమ్మి విశాలాంధ్రకిచ్చిన త్యాగధనుడు చంద్ర రాజేశ్వరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు గుబ్బల వెంకటేశ్వరంావు , బొద్దాని కృష్ణ కిషోర్,నూనె రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

12న పోలవరం ప్రాజెక్టు జీపు యాత్ర విజయవంతం చేయాలి

సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

విశాలాంధ్ర-కుక్కునూరు: పోలవరం ప్రాజెక్టు నిధుల సాధన, ప్రాజెక్టు నిర్వాసితుల సమస్య పరిష్కారం కోసం సిపిఐ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుండి జరిగే జీపు యాత్రను విజయవంతం చేయాలని సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య పిలుపు నిచ్చారు. మంగళవారం కుక్కునూరులో సిపిఐ మండల కార్యవర్గ సమావేశం మైసాక్షి వెంకటాచారి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న కృష్ణ చైతన్య మాట్లాడుతూ తెలుగు ప్రజల జీవనాడి పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయింపులో కేంద్ర ప్రభుత్వం మోకాలడ్డుతుందని విమర్శించారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించకుండా, పునరావాస కాలనీలు నిర్మించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని అన్నారు. తక్షణం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించి, ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయించకపోతే భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఐ వేలేరుపాడు మండల కార్యదర్శి బాడిస రాము, జిల్లా సమితి సభ్యులు అయితా సురేష్, సిపిఐ నాయకులు కొన్నే లక్ష్మయ్య, కూరాకుల బాబురావు, వరక శ్యామల, మడిపల్లి రమణయ్య,తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: మండలంలోని మైసన్న గూడెం గ్రామంలో మంగళవారం జరిగిన విద్యుత్ ప్రమాదంలో నుల కాని యుగంధర్(28) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందారు. అదే గ్రామానికి చెందిన నులకాని యుగంధర్ కోళ్ల ఫారానికి వేడి ఎక్కువగా వస్తుందని రేకుల షెడ్డు పై తాటాకులు పరిచేందుకు రేకుల షెడ్డు పైకి ఎక్కడంతో విద్యుత్ తీగలు తగిలి యుగంధర్ అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

CHANGE OF NAME
I, DUSANAPUDI SATYA DHANA LAKSHMI (New Name), W/o YERRAMSETTI RAMAKRISHNA, Previously Called YERRAMSETTI SATYA DHANA LAKSHMI (Old Name), Resident of D.No. 9-238, Main Road, Venkatrayapuram, Tanuku, West Godavari District-534215, Andhra Pradesh, Now Changed my Name from YERRAMSETTI SATYA DHANA LAKSHMI(Old Name) to DUSANAPUDI SATYA DHANA LAKSHMI (New Name). Today onwards Use my New Name for all further Transactions.

రైతుల ఆర్థికాభివృద్ధికి నూతన ఆవిష్కరణలు

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం రూరల్ : రైతులు తక్కువ పెట్టుబడితో నాణ్యమైన ఉత్పత్తులు సాధించడంతో పాటు ఆర్థికాభివృద్ధి సాధించే విధంగా శాస్త్రవేత్తలు నూతన ఆవిష్కరణలు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి అన్నారు. మంగళవారం వెంకట్రామన్నగూడెం, డాక్టర్ వై.ఎస్.ఆర్. హార్టికల్చరల్ యూనివర్శిటిలో సుమారు రూ.4 కోట్లతో నిర్మాణం చేసిన డిజిటల్ సెంట్రల్ లైబ్రేరీ, మొబైల్ ఎక్స్‌టెన్షన్ వాహనాన్ని మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణతో కలిసి ప్రారంభించడంతో పాటు నూతన బాలికల వసతి గృహానికి శంఖుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి పరంగా లభించిన వనరులతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని, ప్రభుత్వపరంగా అందిస్తున్న వ్యవసాయ సహకారాన్ని సద్వినియోగం చేసుకుని రైతులు ఉద్యానవన పంటలలో అభివృద్ధి సాధించాలన్నారు. ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా లక్షల హెక్టార్లలో హార్టీకల్చరల్ పంటలు పండించడానికి అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి తాడేపల్లిగూడెంలో యూనివర్శిటీని ఏర్పాటు చేశారని అన్నారు. పలు పంటలపై పరిశోధనలు చేసి నాణ్యమైన విత్తనాలు అందిస్తున్న ఘనత యూనివర్శిటీకి దక్కుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ అన్ని రకాల పంటలకు అనుకూలమైనదని అన్నారు. యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ టి.జానకిరామ్ మాట్లాడుతూ గ్రామాల్లో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు యూనివర్శిటీ నుంచి సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎంపి కోటగిరి శ్రీధర్, చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాద్, యూనివర్శిటీ రిజిస్ట్రార్ బి. శ్రీనివాసులు, కె.వి.కె. శాస్త్రవేత్త కరుణశ్రీ, ధనుంజయరావు, వెంకటస్వామి, ఎంపిపిలు ఘంటా శ్రీలక్ష్మీ, పొనుకుమాటి శేషులత, తహశీల్దార్ అప్పారావు, సర్పంచ్లు, ఎంపిటీసిలు, రైతులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంచార జాతుల సంక్షేమానికి కార్యాచరణ

- జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

విశాలాంధ్ర - భీమవరం : సంచార జాతులు, యానాదుల సంక్షేమం కొరకు ఈ సంవత్సరం ప్రత్యేక డ్రైవ్ ను చేపట్ట నున్నట్లు జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సంచార జాతుల స్థితిగతులపై రాష్ట్ర సంచార జాతుల చైర్మన్ పెంద్ర వీరన్న, ఇతర అధికారులతో సమావేశమై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం సంచార జాతులు, యానాదుల సంక్షేమం కొరకు ప్రత్యేక డ్రైవ్ లను ఏర్పాటు చేసి, వారికి విద్య, వైద్యం, వసతి సౌకర్యాల కొరకు కృషి చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో అనేక ప్రాంతాల్లో సంచార జాతులు ఉన్నారన్నారు. త్వరలో వీరందరినీ గుర్తించి వీరి సంక్షేమా నికి ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర సంచార జాతుల చైర్మన్ పెంద్ర వీరన్న, డీఈవో ఆర్.వెంకటరమణ, ఎస్.ఎస్.ఎ పిఓ శ్యాంసుందర్, డిఎంఅండ్ హెచ్వో డి.మహేశ్వరరావు పాల్గొన్నారు.

గోపాలరావు మృతి తీరని లోటు

విశాలాంధ్ర - వేలేరుపాడు : పూచీరాలకాలనీ శాఖ కార్యదర్శి కట్టి గోపాలరావు హఠాత్ మరణం సిపిఐకి తీరని లోటని సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య సంతాపం వ్యక్తం చేశారు. మంగళవారం ఉదయం చని పోయిన గోపాలరావు పార్థివ దేహానికి ఎర్రకండువా కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ పిలుపు మేరకు అనేక పోరాటాలలో ఎంతో చురుకైన పాత్ర పోషించిన వ్యక్తి అన్నారు. సిపిఐ శాఖా కార్యక్రమాల్లో ముందుండి నడిపించే వ్యక్తిని కోల్పోవడం చాలా బాధాకరమన్నారు. ఆయన మరణం పట్ల సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. గోపాలరావు కుటుంబ సభ్యులకు జిల్లా కార్యవర్గ సభ్యులు సన్నేపల్లి సాయిబాబు, మండల కార్యదర్శి బాడిస రాము, రామవరం సర్పంచ్ పిట్ట ప్రసాద్, ఏపీజీఎస్ జిల్లా కార్యదర్శి కారం దారయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు పిట్టా వీరయ్య, ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి ఎర్ర మధు, తదితరులు తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

ఉపాధి కూలీలు ఓఆర్ఎస్ పై అవగాహన కలిగి ఉండాలి

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం మండలం సి హెచ్ అగ్రహారం గ్రామంలో ఉపాధి హామీ పథకం కూలీలకు ఓ ఆర్ ఎస్ పై అవగాహన కార్యక్ర మం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సహాయకుడు నామాలరాజు మాట్లాడుతూ వడ దెబ్బ, కలుషితమైన నీరు త్రాగడం వల్ల శరీరంలోని నీటి శాతం తగ్గి ప్రాణాపాయం కలిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ప్రతిఒక్కరూ ఓఆర్ఎస్‌పై అవగాహన కలిగి వుండాలని తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చుక్కా అప్పారావు, ఏఎన్ఎం ఏసమ్మ, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రామానాయుడు అక్రమ అరెస్టుకు నిరసన

విశాలాంధ్ర - గణపవరం: పాలకొల్లు శాసనసభ్యులు నిమ్మల రామానాయుడును అక్రమంగా మంగళవారం అరెస్టుచేసి పాలకొల్లు నుంచి గణపవరం స్టేషన్ కు తరలింపు జరిగిందని టిడిపి నాయకులు తెలిపారు. గణపవరం పోలీస్ స్టేషన్ లో రామానాయుడుకు సంఘీభావంగా ఉంగుటూరు మాజీ శాసనసభ్యులు, ఏలూరు జిల్లా తెదేపా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, ఉండి శాసనసభ్యులు రామరాజు, తణుకు మాజీ ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ, గణపవరం పోలీసు స్టేషనులో రామానాయుడుకు సంఘీభావం తెలిపారు. పాలకొల్లులో దళితుల భూములలో అక్రమ మట్టి తవ్వకాలు అడ్డుకోవడంతో ఈ అక్రమ అరెస్టు జరిగిందని తెలుగుదేశం నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ నిరసన కార్యక్రమంలో నిడమర్రు మండల టిడిపి అధ్యక్షులు ముత్యాల వెంకటేశ్వరరావు (స్వామి), జిల్లా మహిళా టిడిపి కార్యదర్శి ఉన్నమట్ల సునీత, టిడిపి గణపవరం మండల పార్టీ అధ్యక్షులు ఇందుకూరి రామకృష్ణంరాజు, గణపవరం పట్టణ అధ్యక్షులు కుసంపూడి సురేంద్ర రాజు, కవల కోసం రాంబాబు, కూనసాని నాగేశ్వరరావు, ఉంగుటూరు నియోజకవర్గంలో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు గణపవరం పోలీస్ స్టేషన్ వద్ద నిరసన తెలిపారు.

స్లూయిజ్‌లకు మరమ్మతులు చేపట్టండి

విశాలాంధ్ర -భీమవరం టౌన్ :నియోజకవర్గ పరిధిలో ఉన్న స్లూ యిజ్ లను పరిశీలించి వాటికి మరమ్మత్తులు అవసరమైతే వెంటనే చేపట్టాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు స్థానిక కాపు కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా పెదగరువు వద్ద ఉన్న స్లూయిజ్‌ను, శృంగ వృక్షం వద్ద ఉన్న స్లూయిజ్ లకు వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిఈ కే శ్రీనివాస్, ఏఈ వినయ్ కుమార్ పాల్గొన్నారు.

ఏపీని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

భీమవరం -భీమవరం టౌన్ : ఏపీని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ పనిచే స్తున్నారని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన రూ.3 లక్షల చెక్కును లబ్ధిదారుడు బొర్రా రామచంద్ర రావు కుమారుడు వాసుకు మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందించేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వైయస్సార్ ఆరోగ్యశ్రీ పేరిట 3 వేలకు పైచిలుకు వ్యాధులకు ఉచిత వైద్యాన్ని కార్పొరేట్ ఆసుపత్రులలో పేదలకు అందిస్తున్నారన్నారు. ఈ పథకాన్ని రాష్ట్రం తో పాటుగా ఇతర రాష్ట్రాల్లో ఎంపిక చేసిన కార్పొరేట్ హాస్పిటల్లో కూడా ఈ పథకం అమలయ్యే విధంగా ముఖ్యమంత్రి చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకంలో లేని వ్యాధులకు సైతం ముఖ్యమంత్రి సహాయనిధి నుండి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదుకుని వైద్యం చేయిస్తున్నారన్నారు. భీమవరం నియోజకవర్గంలోని ప్రజలతో పాటుగా జిల్లాలోని ప్రజలకు కూడా వైద్యపరంగా మరింత మేలు చేసేందుకు 100 పడకల ఆసుపత్రిని కూడా భీమవరంలో నిర్మించనున్నట్టు తెలిపారు.

మొక్కల పెంపకం వ్యాపకం కావాలి

విశాలాంధ్ర-మండవల్లి: జీవరాశుల మనుగడ మొక్కలతోనే ముడిపడి ఉందని నేడు నాటిన మొక్కలే రేపటి వృక్షాలు అవుతాయని ప్రముఖ పర్యావరణవేత్త సూదాబత్తుల విజయ్‌కుమార్ అన్నారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా చేపట్టిన కార్యక్రమాల్లో మండవల్లి హైస్కూలులో మంగళవారం సిందూరం మొక్కలు నాటి వాటికి రక్షణవలయాలు ఏర్పాటు చేశారు. ఐక్యవేదిక సభ్యులు, హైస్కూలు ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విజయ్‌కుమార్ మాట్లాడుతూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాలన్నా, కాలుష్యం తగ్గాలన్నా ప్రతి ఒక్కరు మొక్కలు నాటడంతో పాటు వాటిని సంర క్షించాలన్నారు. ప్రజలు చైతన్యమైన నాడే విచక్షణా రహితంగా మొక్కలను నరికివేయటం ఆగుతుందన్నారు. పర్యావరణ సమతుల్యతకు విఘాతం కలిగితే ప్రకృతిలో జీవులు జీవనాన్ని సాఫీగా సాగించలేవన్నారు. కార్యక్రమంలో ఐక్య వేదిక నాయకులు ఎల్ఎస్ భాస్కరరావు, టి.అప్పారావు,హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర-మండవల్లి: విద్యార్థి దశనుండే కంప్యూటర్ విజ్ఞానాన్ని కలిగి ఉండాలని గ్రంథ పాలకురాలు షేక్ పర్వీన్ అన్నారు. మండవల్లి శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా మంగళవారం కంప్యూటర్ అంటే ఏమిటి, మెయిల్ ఎలా క్రియేట్ చేయాలి, ఉపయోగాలు గూర్చి విద్యార్థులకు పర్వీన్ అవగాహన కల్పించారు. నేటి పోటీ ప్రపంచంలో పుస్తకాల పఠనంతో పాటు కాంపిటేటివ్ పోటీల్లో విజయం సాధించాలంటే కంప్యూటర్ వినియోగంపై నైపుణ్యం కలిగి ఉండాలని సూచించారు. వేసవి తరగతులకు హాజరవుతున్న చిన్నారులకు పుట్టినరోజు వేడుకలను నిర్వహిస్తూ వారి సంతోషాన్ని రెట్టింపు చేస్తున్నారు.

జనసేన ఆధ్వర్యంలో త్రాగునీరు సరఫరా

విశాలాంధ్ర - నిడమర్రు: నిడమర్రు మండలం దేవర గోపవరం గ్రామ ప్రజలు మంగళవారం త్రాగునీరు సమస్యతో ఇబ్బంది పడుతున్నారని జనసేన నాయకులు తెలియచేయగా వెంటనే స్పందించి శ్రీ లక్ష్మీనారాయణ ఫౌండేషన్ ట్యాంకర్ ద్వారా ప్రజలకు తాగునీరును ఉంగుటూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్ చార్జ్ పత్సమట్ల ధర్మరాజు ఆధ్వర్యంలో సరఫరా చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ గ్రామ అధ్యక్షులు కాకర్ల వెంకట సరేష్, ఉపాధ్యక్షులు నరాల సాయి, కందులపాటి చందు, కార్యదర్శిలు వినుకొండ ప్రసాద్,లంకలపల్లి సురేష్, గ్రామ జనసేన పార్టీ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల కరపత్రాల ఆవిష్కరణ

విశాలాంధ్ర-ఆకివీడు : పశ్చిమ, కృష్ణ జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఈనెల పది నుండి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు టిడిపి మండల అధ్యక్షులు మోటుపల్లి రామచంద్రరావు తెలిపారు. మంగళవారం ఆకివీడు ప్రీమియర్ లీగ్ పేరుతో టిడిపి పార్టీ 12వ వార్డు ఇంచార్జ్ దుబా సురేష్ ఆర్గనైజేషన్లో నిర్వహించబడుతున్న క్రికెట్ టోర్నమెంట్ ప్రచార కరపత్రాలను ఎమ్మెల్యే రామరాజు, ఆకివీడు మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు, మాజీ ఏఎంసీ చైర్మన్ మోటుపల్లి రామవరప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూయువత క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని పశ్చిమ, కృష్ణాజిల్లా స్థాయిలో జరుగుతున్న ఈ క్రికెట్ టోర్నమెంట్లో జట్లు తమ ప్రతిభ చూపాలనిఅన్నారు. ఆర్గనైజర్ సురేష్ మాట్లాడుతూ మొదటి బహుమతి రూ. 20వేలు, రెండవ బహుమతి రూ. 15వేలు, మూడవ బహుమతి రూ. 10వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆకివీడు పట్టణ అధ్యక్షుడు బొల్లా వెంకట్రావు, మోటుపల్లి సత్యనారాయణ, ఉండి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు హరి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ భూముల రీ సర్వే ప్రారంభం

విశాలాంధ్ర-పోడూరు: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వ్యవసాయ భూముల రీ సర్వే కార్యక్రమం పోడూరు మండలం పెనుమదం వద్ద పోడూరు జడ్పిటిసి గుంటూరు పెద్దిరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రయోజనం చేకూర్చటానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రీ సర్వే ఏర్పాటు చేశారన్నారు. రీ సర్వేలో రైతులు తమ భూములకు సంబంధించిన సమస్యలు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువచ్చి సరిచేయించుకోవచ్చునన్నారు. రీ సర్వే వలన రైతులకు మేలు జరుగుతుందని జడ్పీటీసీ పేర్కొన్నారు.ఎంపీపీ సభ్యితి సుమంగళి సాగర్ తహసిల్దార్ అర్ వి కృష్ణారావు అర్ ఐ కే రాంబాబు సర్వేయర్ కే సత్యనారాయణ సచివాలయ సర్వేయర్ చిరంజీవి వీఆర్వోలు, మెహర్ బాబా శ్రీనివాసరావు డ్రోన్ ఆపరేటింగ్ సిబ్బంది ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా, 2ఎకరాల భూమి ఇప్పించండి

- ప్రజా సంఘాల వినతి

విశాలాంధ్ర-చాట్రాయి: పోలీస్ శాఖ నిర్లక్ష్య వైఖరి వలన పంచాయతీలో దాడికి గురై అవమానభారంతో ఆత్మహత్య చేసుకున్న కలవల శ్రీను కుటుంబానికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా, 2ఎకరాల ప్రభుత్వ భూమి ఇప్పించాలని కోరుతూ ప్రజాసంఘాల నాయకులు చాట్రాయి తహసీల్దారుకు వినతి పత్రం అందజేశారు. సోమవారం చాట్రాయి తహసీల్దారు విశ్వనాథరావుకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ చాట్రాయి మండల చరిత్రలో పంచాయతీలలో దాడులు చేస్తే అవమాన భారంతో ఆత్మ హత్య చేసుకున్న సందర్భం లేదన్నారు.50 సంవత్సరాలుగా అనుభవం ఉన్న వాళ్లు పంచాయతీలు చేసినవాళ్ళ దగ్గర కూడా ఇటువంటి దారుణం జరగలేదన్నారు. ఇతర మండలాల నుంచి తీర్పు ఇవ్వడానికి వచ్చిన వాళ్ళు నీకేం పర్వాలేదు మేమున్నాం మాట్లాడదాం భయపడకుండా పంచాయతీకి రమ్మని కలవాలి శ్రీనుని రప్పించినవాళ్ళు మూకుమ్మడిగా దాడి జరుగుతుంటే చేష్టలుడిగి చూసినట్లు తమకు తెలిసిందన్నారు.అటువంటి వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం సచివాలయ పరిధిలోనే ప్రత్యేక పోలీసు ను ఏర్పాటు చేస్తే గ్రామంలో శాంతి భద్రతలు గురించి స్టేషన్ కు తెలియకుండా ఎలా వుందన్నారు. అనంతరం నూజివీడు రూరల్ సిఐ అంకబాబు కు పోలీసు స్టేషన్ లో వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో సామాజిక చైతన్య వేదిక ఆర్గనైజర్ ఈవీ శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కొమ్ము ఆనంద్ కెవిపిఎస్ నాయకులు కొమ్ము చంటి తదితరులు పాల్గొన్నారు.

చాంబర్స్ డిగ్రీ , పీజీ కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం

విశాలాంధ్ర - పాలకొల్లు: స్థానిక బిఆర్ అండ్ జికేఆర్ చాంబర్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో మంగళవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. ఎ.బి.ఎస్ మూర్తి మాజీ వై.ఎన్ కళాశాల ప్రిన్సిపల్, నేషనల్ సైన్స్ అకాడమీ మెంబర్ కళాశాల ప్రాంగణంలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, కళాశాల చైర్మన్ కెవిఆర్ నరసింహారావు కళాశాల ప్రిన్సిపల్ డా. డి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన అవగాహన కార్యక్రమంలో డా. ఎ.బీ.ఎస్ మూర్తి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ బాధ్యత నేటి యువత మీద ఆధారపడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ మాట్లాడుతూ ప్రతి పౌరుడు వ్యక్తిగత బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణహిత కార్యక్రమాలు చేపట్టడం వల్ల భవిష్యత్తు సుందరంగా ఉండగలదని అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు పర్యావరణం పై అవగాహన కల్పించుటకు ఎకో క్లబ్బులు లాంటివి నెలకొల్పి విద్యార్థుల ద్వారా పర్యావరణ పరిరక్షణ, మొక్కలు నాటడం, ఇంకుడు గుంటలు తవ్వించడం లాంటివి చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమానికి విద్యార్థిని విద్యార్థులు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో రైతులకు అన్యాయం

విశాలాంధ్ర-టి నరసాపురం: వైసీపీ ప్రభుత్వం పాలనలో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు విమర్శించారు. మహానాడులో ప్రకటించిన టిడిపి మేనిపేస్టోకు మద్దతుగా తిరుమల దేవిపేట గ్రామంలో తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి తోట లక్ష్మీనారా యణ ఆధ్వర్యంలో మహిళలు చంద్రబాబు నాయుడు చిత్ర పటానికి మంగళవారం పాలాభిషేకం చేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న శీలం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతే దేశానికి వెన్నెముక అన్నారు. రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్ల్ లు ఇవ్వడం లేదన్నారు. మహానాడులో చంద్ర బాబు ప్రకటించిన మేనిఫెస్టోతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. జగన్ ప్రభుత్వం నవరత్నాల పేరుతో ప్రజలను మోసం చేశారని, కొంతమంది కి డబ్బులు వేసినట్లు వేసి పెంచిన ధరలతో మళ్లీ లాగేస్తున్నారని విమర్శించారు.

ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వాసిరెడ్డి మోహన్ రావు ,సందేపూడి ప్రభాకర్ సాయి, కలిశెట్టి పార్ధసారధి, గండబోయిన శ్రీను, కాల్నీడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నాళం హేమంత్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్

విశాలాంధ్ర - గండేపల్లి : కీ.శే. నాళం హేమంత్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను అతని స్నేహితులు, గండేపల్లి క్రికెట్ యువకులు గత నెల 21వ తేదీన జిల్లా స్థాయి పోటీలను ప్రారంభించారు. ఈ జిల్లా స్థాయి మెగా టోర్నమెంట్‌లో జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందిన 32 టీంలు పాల్గొన్నాయి. వీరిలో దివాన్ చెరువు జట్టు మొదటి స్థానం సాధించగా, జగ్గంపేట జట్టు ద్వితీయ స్థానం సాధించింది. ఏలేశ్వరం జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. వీరికి తహశీల్దారు కెవివి సత్యనారాయణ షీల్డ్‌లను, నగదు బహుమతిని అందజేశారు. మొదటి బహుమతిగా రూ. 22,222, రెండవ బహుమతిగా రూ.11,111, మూడో బహుమతిగా రూ. 5,555 అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాస్థాయి టోర్నమెంట్ నిర్వహించడం అంటే గొప్ప విషయమన్నారు. టోర్నమెంట్ పెట్టిన యువకులను అభినందించారు.

పురుగుల మందు పిచికారి చేసేటప్పుడు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

విశాలాంధ్ర - గండేపల్లి : ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గండేపల్లి మండలం మురారి గ్రామంలో ఎఫ్ఎంసి కంపెనీ వారి ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా 137 సంవత్సరాలుగా రైతులకు సేవలు అందిస్తున్న ప్రపంచ శ్రేణి అగ్రగామి అయిన పురుగుల మందుల ఎఫ్ఎంసి కంపెనీ వారు రైతులకు పురుగుమందుల వాడకంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, మెలకువలు గురించి సవివివరంగా అవగాహన కల్పించారు. ఆల్ ఇండియా ప్రెసిడెంట్ రవి అన్నవారపు, కమర్షియల్ డైరెక్టర్ రత్నాకర్, డీజీఎం గోపీనాథ్, డీజీఎం ప్రవీణ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ జగ్గంపేట ఏడి గంగాధర్, మండల వ్యవసాయ శాఖ అధికారి సద్గురుమూర్తి, గండేపల్లి మండల పరిషత్ అధ్యక్షులు దొరబాబు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులకు పురుగు మందులు వాడకానికి తీసుకోవలసిన జాగ్రత్తలు సంబంధించిన పరికరాలను రైతులకు అందచేసారు. అనంతరం పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని దేవాలయం ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మురారి గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ వాకా దివ్యశేఖర్‌కు ఘన సత్కారం

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : మండలం అంబేద్కర్ కోనసీమ జిల్లా ఐఐడి బాంబే ద్వారా పీహెచ్డీ పట్టాను పొందిన దివ్య శేఖర్ ను మంగళవారం అంగరలోని శ్రీ సిద్ధార్థ కళాశాల అధ్యాపకులు గ్రామానికి చెందిన విద్యావేత్తలు ఘనంగా సత్కరించారు. ఇసింథటిక్ అపర్చుర్ రాడాల్ శాటిలైట్ చిత్రాలు ఉపయోగించి భూమి కదలికలపై పరిశోధనచేసిన మండలంలోని అంగరకు చెందిన యువకుడు వాక దివ్య శేఖర్‌ను పలువురు ప్రజా ప్రతినిధులు ప్రశంసించారు. ఎంపీడీవో ఎం రామకృష్ణారెడ్డి, గ్రామ సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు అడ్డాల శ్రీనివాస్, పెద్దిరెడ్డి శేషారత్నం, దివ్య శేఖర్ కృషిని అభినందించారు. వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతానికి చెందిన గ్రామీణ ప్రాంతానికి చెందిన యువకుడు ప్రతిభ కనపర్చడం నేటి యువతకు ఆదర్శమన్నారు. దివ్య శేఖర్ తల్లిదండ్రులు వాకా పరమేశ్వరరావు, కృష్ణకుమారి దంపతులను ప్రశంసించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పివి రమణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

తాళ్లపూడిలో జాబ్ మేళా

విశాలాంధ్ర - తాళ్లపూడి : తాళ్లపూడి మండల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న రెండవ మెగా జాబ్ మేళా శ్రీ కరిబండి సుబ్బారావు మెమోరియల్ విద్యా సంస్థ ల ప్రాంగణం లో 7వ తేదీ బుధవారం వికాస వారి సౌజన్యం తో జరగనుంది. తాళ్ళపూడి చుట్టూ ప్రక్కల మండలాల నిరుద్యోగులు అందరూ ఈ జాబ్ మేళాను ఉపయోగించుకోవాలని సంస్థ గౌరవ అధ్యక్షులు సింహాద్రి జనార్ధనరావు, కరిబండి కళాశాల డైరెక్టర్ త్రినాధ స్వామి, వికాస మేనేజర్ సత్యనారాయణ పేర్కొన్నారు. దీనికి సంబంధించి మంగళవారం కళాశాలలో సమావేశమై ఏర్పాట్లపై చర్చించుకున్నారు.

కళాశాల విద్యార్థులను వలంటీర్లుగా సిద్ధం చేస్తూ వారికి కొన్ని సూచనలు చేశారు. వికాస మేనేజర్ సత్యనారాయణ, తాళ్ళపూడి మండల మానవత అధ్యక్షుడు జోడాల వెంకటేశ్వరరావు, మాజీ అధ్యక్షులు గుప్తా, కరిబండి డిగ్రీ కళాశాల బోధనా సిబ్బంది మురళి తదితరులు పాల్గొన్నారు. ఈ ఉద్యోగ మేళాలో 21 కంపెనీలు, 900 కు పైగా ఉద్యోగఅవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు.

ఘనంగా బిజెపి విజయోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - బిక్కవోలు : బిక్కవోలు మండలం రంగాపురం గ్రామంలో బిజెపి కన్వీనర్ శివ కృష్ణంరాజు ఆధ్వర్యంలో విజయోత్సవ వేడుకలు ఘనంగా జరిపించారు. ముఖ్య అతిథిగా జిల్లా ఇన్చార్జి కృష్ణ భగవాన్ హాజరయ్యారు. ప్రధాని మోడీ ఆశయాలను ప్రతి ఒక్కరు సాధించేలా పనిచేయాలని కృష్ణ భగవాన్ కోరారు. బిజెపి సీనియర్ నేతలను ఘనంగా సత్కరించారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు తోటకూర వెంకటేశ్వరరావు, శివాజీ,కాకినాడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

విశాలాంధ్ర - కాకినాడ : పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని, ప్రస్తుత కాలంలో రోజురోజుకి పెరుగుతున్న కాలుష్యం వలన ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటవలసిన అవసరం ఉందని పలువురు పేర్కొన్నారు. అసోసియేషన్ ఆఫ్ ఆలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ కాకినాడ స్వాతి హెల్పింగ్ హాండ్స్ వారి ఆధ్వర్యంలో అధ్యక్షుడు అల్లె కిరణ్ కుమార్ అధ్యక్షతన పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, విశిష్ట అతిథిగా డిస్ట్రిక్ వైస్ గవర్నర్ ఆలై వనుం శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులందరూ మొక్కలు నాటారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి అలై పెంకె గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

వెండి వింజామరుల అందజేత

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లిలో గల జగద్గురు శ్రీశ్రీశ్రీ ఆది శంకరాచార్య ధ్యాన మందిరం కు దేవరపల్లి మండలం పల్లంట్ల గ్రామానికి చెందిన అఖిలభారత విష్ణు సహస్రనామ ఫెడరేషన్ డైరెక్టర్ దేవరపల్లి మండల మానవతా సంస్థ చైర్మన్ బలుసు సత్యనారాయణ వెండి వింజరామాలను అందజేశారు శంకరాచార్య ధ్యాన మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు తోట సత్యనారాయణకు అందజేశారు ఈ సందర్భంగా బలుసు సత్యనారాయణ మాట్లాడుతూ మానవతా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఉపనిషత్తులు వాటి సారాంశాన్ని విపులంగా వివరిస్తున్నారని జగద్గురు ఆదిశంకరాచార్యులు ను స్ఫూర్తిగా తీసుకొని ధ్యాన మందిరము కు వెండి వింజరామాలు అందిస్తున్నట్లు తెలిపారు ఆదిశంకరాచార్య ధ్యాన మందిరం కమిటీ చైర్మన్ చలంచర్ల వీర వెంకటరనాథ్ ఉపాధ్యక్షులు నారాయణ విశ్వేశ్వరరావు కార్యదర్శి చిరవూరు సత్యనారాయణ గౌరవ సలహాదారు విష్ణుభట్ల రామారావు ప్రధాన కార్యదర్శి తోట సత్యనారాయణ బలుసు సత్యనారాయణ విజయలక్ష్మి దంపతులను అభినందించారు ఈ కార్యక్రమంలో బలుసు రామకృష్ణ మహంత్ పాల్గొన్నారు అంతకుముందు ఓకే పానిపట్టంపై గల వినాయకుడు ఆదిశంకరాచార్యులు మహాలక్ష్మి జ్ఞాన సరస్వతి లకు ప్రత్యేక పూజలు హారతులు నిర్వహించారు

స్వయంగా భక్తులతో ద్రవ్యాభిషేకం



విశాలాంధ్ర - అనపర్తి : స్థానిక శ్రీదేవి భూదేవి సమేత శ్రీ జనార్ధన స్వామి ఆలయ జీర్ణోద్ధరణ మహా సంప్రోక్షణ మహోత్సవం లో భాగంగా నేడు (బుధవారం) భక్తులు ప్రతిష్టా విగ్రహాలు, ధ్వజస్తంభముకు భక్తులు స్వయంగా అభిషేకం చేసుకోవచ్చని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ అభిషేకం చేసుకునే భక్తులు ఉదయం తొమ్మిది గంటల నుండి ఆవు పాలు, పెరుగు, తేనె, గంధం, పసుపు నీళ్లు, ఏదైనా నది జలం లేదా గంగాజలం తో స్వయంగా అభిషేకం చేసుకోవచ్చని తెలిపారు.

అందుబాటులోకి రానున్న ఈ -ఆటోలు

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : క్లీన్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా ఇంటింటి చెత్త సేకరణకు ఈ-ఆటోలను రాష్ట్ర ముఖ్యమంత్రి గురువారం ప్రారంభించనున్నారని రాష్ట్ర పురపాలక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరి వై.శ్రీలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్లీన్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా రాష్ట్రంలో ఇంటింటి చెత్తను తడి, పొడి చెత్తగా వేరుగా సేకరించటానికి 516 ఈ-ఆటోలను ప్రభుత్వం అందించిందని, ఈ-ఆటోలను సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి ప్రారంభిస్తారని తెలిపారు. శుక్రవారం నుండి ఈ-ఆటోలు అందుబాటులోకి వస్తాయని, తద్వారా మెరుగైన ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం చేయడానికి అవకాశం కలుగుతుందని తెలిపారు. ఇప్పటికే ప్రజారోగ్య కార్మికులకు దశల వారిగా ఆటోల డ్రైవింగ్ శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. ఈ-ఆటోల ప్రారంభోత్సవ కార్యక్రమ నిర్వహణకు స్వచ్ఛ్ ఆంధ్ర కార్పోరేషన్ ఎండీ, సీడీఎంఏ, జిల్లా కలెక్టర్, విజయవాడ మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, మంగళగిరి-తాడేపల్లి కమిషనర్లకు విధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.

అవగాహనతోనే పర్యావరణ పరిరక్షణ

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : అవగాహనతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుందని ఎంపీడీవో ఎం. రామకృష్ణారెడ్డి, పలువురు ప్రజా ప్రతినిధులు అన్నారు. అంగర శ్రీ సిద్ధార్థ కళాశాలలో మంగళవారం పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. వార్షిక పరీక్షల్లో ప్రతిభ మొదటి ద్వితీయ సంవత్సరం విద్యార్థులను ఎంపీడీవో రామకృష్ణారెడ్డి, వాసా కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు అడ్డాల శ్రీనివాస్, పెద్దిరెడ్డి శేషారత్నం, సాగు సలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ పీవీ రమణ, వాకా రాజారావు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర - గొల్లప్రోలు : గొల్లప్రోలు పట్టణంలో ట్రాఫిక్‌కు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలతో పాటు కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ వినయ్ ప్రతాప్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం పట్టణములో పలుచోట్ల ట్రాఫిక్ పై తగు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణ లేకుండా టు వీలర్ ఫోర్ వీలర్ పై దృష్టి సారించి, కేటాయించిన స్థలంలోనే పెట్టుకోవాలని తెలిపారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, రోడ్డు భద్రత సూత్రాలు కూడా పాటించాలని లేనియెడల జరిమానా విధించడం జరుగుతుందని వారు తెలిపారు. గొల్లప్రోలు పట్టణంలో ఆటోలు సైతం ఎక్కడపడితే అక్కడ స్టాప్ చేయడం వల్ల ట్రాఫిక్కుకు అంతరాయం కలుగుతోందని తెలిపారు. ట్రాఫిక్ నియమాల పద్ధతులు పై ప్రజలకు చిన్న వ్యాపారస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్ మేళాలను యువత వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - రాజానగరం : నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళాలను యువత వినియోగించుకోవాలి నియోజకవర్గ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు.మండలంలోని నరేంద్రపురం గ్రామంలో ఇందుకు సంబంధించిన పోస్టర్ని ఎమ్మెల్యే రాజా, రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ తూర్పుగోదావరి జిల్లా స్పెషల్ ఆఫీసర్ ఎం.చంద్రశేఖర్ రెడ్డి సంయుక్తంగా మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జాబ్ మేళాలు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. దీనిలో భాగంగా ఈనెల 9వ తేదీన నన్నయ్య యూనివర్శిటీలో జాబ్ మేళా ఏర్పాటు చేసినట్లు చెప్పారు.ఈ జాబ్ మేళాలో మొత్తం 14 కంపెనీలు పాల్గొంటున్నాయని సుమారు 630 ఉద్యోగ అవకాశాలు ఉన్నాయనీ,ఈ అవకశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఈ నంబర్లను 7989656834, 9581810049 నంబర్లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ స్పెషల్ ఆఫీసర్ ఎం.చంద్రశేఖర్ రెడ్డి,డిస్ట్రిక్ట్ మేనేజర్ కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

విశాలాంధ్ర-గుడివాడ : గుడివాడ మల్లాయపాలెం లోని టిడ్కో గృహాల ప్రాంగణంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో మంగళవారం రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, రాష్ట్ర పురపాలక పరిపాలన పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి శ్రీలక్ష్మి, ఎమ్మెల్సీ, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త తలసీల రఘురాం, రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ కమిషనర్ కోటేశ్వరరావు, కలెక్టర్ పి రాజాబాబు, ఎస్పి పి.జాషువా, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు పేర్ని వెంకటరామయ్య, కొడాలి శ్రీవెంకటేశ్వరరావులు ఏర్పాట్లు పరిశీలిం చారు. ఈ పర్యటనలో మంత్రుల వెంట టిడ్కో సిఈ కృష్ణారెడ్డి, ఆర్డీవో పద్మావతి, పివో చిన్నోడు, మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా ఐక్యతతో పనిచేద్దాం

విశాలాంధ్ర-గుడివాడ : గుడివాడ నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా కలసి కట్టుగా పనిచేద్దామని బిసి సంఘం రాష్ట్ర ప్రధాన కర్యదర్శి రావులకొల్లు వెంకటనాగమల్లేశ్వరరావు, నియోజవర్గ అధ్యక్షులు దారం నరసింహరావులు పిలుపు నిచ్చారు. సోమవారం రాత్రి స్థానిక అంజనేయ పంక్షన్ హాలులో బిసి సంఘ నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రావుకొల్లు, దారంలు మాట్లాడుతూ ఇటీవల జరిగిన జ్యోతిరావు, సావిత్రిబాయి పూలేల విగ్రహా అవిష్కరణ విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. బీసీలు రాజ్యాధికారం సాధించేందుకు ఐక్యతతో ఉండలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు కె.యశోదాయామినిదేవి, ఉపాధ్యక్షులు డి.వెంకటేశ్వరరావు, బి.వెంకటేశ్వరరావు, వై, గొవర్ధనరావు, అగస్తి అరివిష్ణు, బి.సోమశేఖర్, ఎం.పద్మ, రాధకృష్ణ, ఎం.వెంకటలక్ష్మీ, ఉద్యోగ సంఘ నాయకలు తదితరులు పాల్నొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని తొలగించాలి

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలం భట్ల పెనుమర్రు గ్రామంలో యాదవ బజార్ వద్ద గల గంగానమ్మ గుడి సమీపంలోని ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభంతో ప్రజలు తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారని పామర్రు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త వర్ల కుమార్ రాజా ఆవేదన వ్యక్తం ఆ స్తంభాన్నితొలగించి దాని స్థానంలో కొత్త స్తంభం ఏర్పాటుకు స్పందన కార్యక్రమంలో అర్జీ దాఖలు చేసినా ఏ విధమైన స్పందన లేదని, అలాగే జగనన్నకి చెబుదాం లో ఫిర్యాదు చేసినా ఉలుకు పలుకు లేదని వ్యాఖ్యానించారు. ఆయన మంగళవారం ప్రమాదభరితంగా ఉన్న ఆ విద్యుత్ స్తంభాన్ని పరిశీలించి, విలేకరులకు దీనికి సంబంధించిన వివరాలను ప్రకటించారు. గ్రామంలోసంతోషంగా గంగానమ్మ సంబరాలు జరుపుకోవడానికి సిద్ధమవుతున్న తరుణంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం గురించి అధికారులు కానీ, ప్రజా ప్రతినిధులుగాని స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా అధికారులు కొత్త విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేసి ఏ విధమైన ప్రమాదాలు జరగకుండా కాపాడాలని కోరారు.

"క్రమబద్ధీకరణ"పై కాంట్రాక్టు ఉద్యోగుల హర్షం

విశాలాంధ్ర-కూచిపూడి : 2014 సంవత్సరానికి ఐదు సంవత్సరాలు సర్వీసుఉన్న కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరణ చేస్తానని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేసిన ప్రకటన పట్ల మొవ్వ మండల పారామెడికల్ సిబ్బంది మంగళవారం హర్షం ప్రకటించారు. ముఖ్యమంత్రి అప్పట్లో జరిపిన పాదయాత్రలో బాధలు విని "నే విన్నాను.. నేనున్నాను"అంటూ ఇచ్చిన హామీ నేడు సఫలీకృతం కావడంతో ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియపరిచారు. మాట తప్పని మడమ తిప్పని ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియపరుస్తున్నామని, త్వరలోనే దీనికి సంబంధించిన జీవోను విడుదల చేయాలని కోరుతూ పారామెడికల్సిబ్బంది కే రామాంజనేయులు, వి నాగరాజు, ఎం శ్యామ్ కుమార్, వి సూర్య ప్రకాశరావు, ఏపీ ఎన్జీవో యూనిట్ వైస్ ప్రెసిడెంట్ బి విజయ్ కుమార్, సంయుక్త కార్యదర్శి జి సమిత హర్షం ప్రకటించారు.